## దక్షిణాఫ్రికాలో నేడే ఎన్నికలు





**జోహెన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా పార్లమెంటుకు బుధవారంనాడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా 23,292 పోలింగ్ కేంద్రాలను ఉదయం ఏడు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటలవరకు ఓటింగ్‌ప్రక్రియ కోసం సిద్ధం చేసినట్లు దక్షిణాఫ్రికా ఎన్నికల సంఘం ప్రకటించింది. దిగువసభ నేషనల్ అసెంబ్లీకి, రాష్ట్రాలలో కూడా ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. దక్షిణాఫ్రికాలో తిరుగులేని అధికారం చెలాయిస్తున్న ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున దేశాధ్యక్షుడు రామాఫోసా కమ్యూనిస్టుపార్టీ మద్దతుతో తిరిగి ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఐతే ముందస్తు ఎన్నికల సర్వేలు ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నివేదికలు ఇవ్వడంతో ఈసారి ఫలితాలపై చాలా ఉత్కంఠ ఏర్పడింది. దిగువసభ జాతీయ అసెంబ్లీలో 200 స్థానాలు ఉండగా, వివిధ రాష్ట్రాలలో జనాభా ప్రాతిపదికన సీట్లు ఖరారు అవుతాయి. 70 రాజకీయపార్టీలు, 11 మంది ఇండిపెండెంట్లు సహా మొత్తం 14,889 మంది అభ్యర్థులు జాతీయ అసెంబ్లీకి పోటీ పడుతున్నారు. విదేశాలలో ఉండే రిజిస్టర్ ఓటర్లు ఈనెల 17,18 తేదీల్లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. దేశంలో 27,28 తేదీల్లో గర్భిణీలు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. దేశంలో 18 ఏళ్ళు ఆ పైబడిన యువ ఓటర్ల సంఖ్య ఈసారి 27.79 లక్షలకు చేరుకుంది.

## పపువా న్యూగినియాపై సానుభూతి

### సురక్షిత ప్రాంతాలకు 8 వేలమంది తరలింపు

**పోర్ట్ మోరెస్బై :** ఈ శతాబ్ది దారుణ ప్రకృతి విలయంతో ఆకస్మికంగా వార్త



ల్లోకి వచ్చిన పపువా న్యూగినియా దేశంలో ఏర్పడిన జాతీయ విషాదాన్ని పరిష్కరించేందుకు పలు దేశాల సానుభూతి వెల్లువెత్తుతున్నది. ఈ పూర్వరంగంలో తాజాగా రెడ్‌క్రాస్ సొసైటీ రంగంలోకి దిగింది. భారీ క్రేన్లు కూడా ఆ దేశానికి తరలిస్తున్నారు. కొండచరియలు విరిగిపడి 2,000 మంది సజీవ సమాధికావడంతో భారత్, చైనా సహా అనేక దేశాలు సహాయక చర్యలు చేపట్టేందుకు, ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చాయి. తాజాగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు 2.5 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని పపువా న్యూగినియా దేశానికి ప్రకటించింది. ఓసియానా (ఆస్ట్రేలియా, మెలనేసియా, మైక్రోనేసియా, పోలినేసియా) ఖండ ప్రాంతంలో అంతర్భాగంగా ఉన్న పపువా న్యూగినియాలో గడచిన శుక్రవారంనాడు కొండచరియలు విరిగిపడిపోవడంతో 200 కిలోమీటర్ల విస్తారంలో బండరాళ్ళు పడి ఆరు గ్రామాలలో నివసించే 2000 మంది ప్రజలు సజీవ సమాధి అయ్యారు. ఎనిమిది అడుగుల లోతున గ్రామాలు కూరుకుపోవడంతో వారిని తవ్వితీయడం అతిపెద్ద సవాలుగా మారింది. ఈ పరిస్థితులమధ్య ఇంకా మరిన్ని కొండ చరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని గుర్తించడంతో మరో 7,900 మందిని గ్రామాలు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఐక్యరాజ్యసమితి కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. సానుభూతి ప్రకటించింది. సజీవంగా ఉన్నవారిని వెలికితీసే అవకాశాలు మృగ్యంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

# స్వతంత్ర దేశంగా పాలస్తీనాకు 146 దేశాల గుర్తింపు

### రఫా భద్రతపై నేడు భద్రతామండలి అత్యవసర సమావేశం





**గాజా :** పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా ఇప్పటివరకూ 146 దేశాలు గుర్తింపు లభించింది. ఐక్యరాజ్యసమితిలో మొత్తం 193 సభ్యదేశాలు ఉండగా, ఇప్పటివరకూ 146 దేశాలు పాలస్తీనాను స్వతంత్ర్యదేశంగా గుర్తించాయి. ఐర్లాండ్, నార్వే, స్పెయిన్ దేశాలు గతంలో ప్రకటించిన విధంగా మంగళవారంనాడు చట్టబద్ధమైన గుర్తింపును ఇస్తున్నట్లు ప్రకటించాయి. పశ్చిమ ఆసియాలో శాంతి సాధన జరగాలంటే పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఈ మూడు దేశాల నాయకులూ ప్రకటించారు. రెండు దేశాల సహజీవన పరిష్కారం అనివార్యమని అన్నారు.ఐతే 1967లో పాలస్తీనాకు ఉన్న సరిహద్దులనే ఈనాటికీ తాము గుర్తించి స్వతంత్రదేశంగా పేర్కొంటున్నామనీ, ఇజ్రాయిల్ తిమ్మిదిని బమ్మినిచేస్తూ మార్చేసిన సరిహద్దులను తాము గుర్తించడంలేదని కూడా ఈ మూడు దేశాల నాయకులూ ప్రకటించారు.



మే 10వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానం చేస్తూ పాలస్తీనాకు దేశంగా గుర్తింపు ఇచ్చింది. అందుకు అవసరమైన సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేయడానికి సహకరించాలని, అదేవిధంగా భద్రతా మండలి కూడా తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలనీ కూడా ఒక విజ్ఞప్తి చేసింది. కాగా రఫాలో అమాయకులైన సామాన్య పౌరులపై దాడి చేసి 45 మంది ప్రజలను సజీవ దహనం చేసిన అమానుష ఘటన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారంనాడు ఆకస్మిక, అత్యవసర సమావేశం జరుపుతున్నది.

**లక్ష్యం చేరేదాకా లొంగను: నేతన్యాహూ**

హమాస్ ఉగ్రవాద సంస్థను సమూలంగా నిర్మూలించాలనే తమ లక్ష్యం నెరవేరేవరకూ తాను లొంగేదే లేదని, యుద్ధాన్ని విరమించే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ మంగళవారంనాడు తాజా ప్రకటన చేశారు. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాలు పాలస్తీనాకు గుర్తింపు ఇచ్చిన పూర్వరంగంలో ఆయన ప్రకటన వెలువడింది. మరోవైపు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి కూడా ఇజ్రాయిల్ రఫాలో జరుపుతున్న దాష్టీకంపై అత్యవసరంగా సమావేశమైంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నాయకులు రఫాలో జరిపిన మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇకనైనా యుద్ధం విరమించకపోతే నేతన్యాహూ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరికలు చేస్తున్నాయి. ఆఫ్రికా యూనియన్ కూడా రఫాపై దాడులను తీవ్రంగా ఖండించింది. ఆఫ్రికా యూనియన్ కమిషన్ అధ్యక్షుడు మౌస్సాఫికి మహమత్ రఫాలో పౌర శిబిరంపై దాడిని ఖండించారు. తక్షణం యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. ఇది అంతర్జాతీయ కోర్టు తీర్పును, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని అన్నారు.

**సెంట్రల్ రఫాలో యుద్ధ టాంకులు:**

ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు మంగళవారంనాడు దక్షిణ గాజాలోని గుండెకాయ లాంటి సెంట్రల్ రఫాలోకి ప్రవేశించాయి. యుద్ధం, దాడులు మరింత తీవ్రమయ్యాయి. మరోవైపు రఫాలో ఉన్న కువాయిత్ సెంట్రల్ ఆసుపత్రి మూత పడింది. పెద్ద సంఖ్యలో గాయపడిన ప్రజలు ఆసుపత్రికి వస్తూ ఉండటంతో సేవలు అందించలేక ఆసుపత్రి మూతపడింది. పైగా ఇజ్రాయిల్ దాడుల్లో ఇద్దరు వైద్యసిబ్బంది మరణించడంతో ఆసుపత్రి పనికి రాకుండా పోయింది. ఇదిలా ఉండగా, రఫాలో జరిగిన ఘోరమైన దాడి, 45 మంది ప్రజల సజీవ దహనం ఘటనతో ప్రపంచవ్యాప్తంగా మళ్ళీ నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. లండన్, పారిస్, బెర్లిన్, న్యూయార్క్ సిటీ, ఐర్లాండ్‌లలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ట్యునీషియాలో వందలాదిమంది భారీ ప్రదర్శన జరిపారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఈ ఘటనను ఖండించాయి.

# తాలిబన్లపై ఉగ్రవాద ముద్ర చెరిపేస్తున్న రష్యా









### రెండు నెలల్లో దౌత్యసంబంధాల ప్రక్రియ

**మాస్కో :** నిషేధిత ఉగ్రవాద సంస్థల జాబితా నుండి త్వరలో తాలిబన్‌లను రష్యా విముక్తి చేయనున్నది. రష్యా సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇక తాలిబన్లపై అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ముద్ర రష్యా జాబితాలోంచి పూర్తిగా తొలగిపపోయినట్లే. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్‌నరు ఉటంకిస్తూ, ఆ దేశ ప్రభుత్వ మీడియా ఈ విషయం వెల్లడించింది. ఒకటి రెండు నెలల లోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని కూడా రష్యన్ మీడియా ప్రకటించింది కజఖస్థాన్ 2023 సంవత్సరం ఆఖరులో ఈ నిర్ణయం తీసుకుంది. తర్వాత రష్యా కూడా తాజాగా ఇదే నిర్ణయం ప్రకటించింది. తాలిబాన్ సంస్థపై అంతర్జాతీయ స్థాయిలో ఆంక్షలుఉన్నప్పటికీ కూడా రష్యా చాలా సంవత్సరాలుగా తాలిబాన్లతో వాణిజ్య, వ్యాపార సంబంధాలు కొనసాగించేందుకు అనేక విడతలుగా చర్చలు జరిపి సంబంధాలు కొనసాగిస్తున్నది. ఆఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి రష్యా ఇదే ఆలోచనలో ఉంది. వాస్తవాలను గుర్తించాల్సిన అవసరం ఉందనీ, తాలిబన్లు ఇప్పుడు ఒక దేశ రాజ్యాధికారాన్ని నడుపుతున్నారనీ భావిస్తున్న రష్యా ఈ ఏడాదిలోనే తాలిబన్లపై అతర్జాతీయ ఉగ్రవాదజాబితానుండి విముక్తి చేసి గుర్తింపు ఇవ్వాలని ఆలోచిస్తున్నది. తాలిబన్లు అఫ్గానిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల తర్వాత రష్యా ప్రభుత్వం చాలా స్పష్టంగా ఈ నిర్ణయానికి వచ్చింది. ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్గానిస్థాన్ పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాలిబన్లతో ఇకమీదట రష్యా – అఫ్గానిస్థాన్‌ల మధ్య సరికొత్త దౌత్య సంబంధాలకు తెరలేవనున్నది. అమెరికా అండదండలతో నడిచిన అఫ్గానిస్థాన్ పరిపాలనను తాలిబన్లు 2021లో స్వాధీనం చేసుకున్నారు. అత్యంత కఠినమైన మత రాజ్య పరిపాలన కొనసాగించేరీతిలో మహిళలను పూర్తిగా ప్రజా జీవితం నుండి నిషేధించి పూర్తిగా ఇళ్ళకే పరిమితం చేశారు. ఐతే అఫ్గానిస్థాన్‌లో రష్యాదేశాధ్యక్షుడి ప్రత్యేక అధికార ప్రతినిధి జామిర్ కబులోవ్ ఒక ప్రకటన చేస్తూ, ''తాలిబన్లను ఉగ్రవాద జాబితా నుండి తొలగించడం అనివార్యం, చట్టరీత్యా ఆ ప్రక్రియ జరగాల్సిందే. లేకపోతే ప్రస్తుతం ఉన్న తాలిబన్ల ప్రభుత్వంతో చర్చలకుగానీ, దౌత్య సంబంధాల పునరుద్ధరణకుగానీ, అఫ్గానిస్థాన్ ప్రభుత్వాన్ని గుర్తించడానికిగానీ అవకాశం ఉండదు, అలాంటి ప్రయత్నాలకు అర్థంమే ఉండదు'' అని పేర్కొన్నారు.

**23 మంది తాలిబన్లు హతం:**

తాలిబన్ తీవ్రవాదులు చురుగ్గా ఉండే పాకిస్థాన్ వాయువ్య సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన పలు దాడుల్లో 23 మంది తాలిబన్ ఉగ్రవాదులు హతులయ్యారు. ఆ పోరాటంలో మరో ఏడుగురు పాకిస్థాన్ సైనికులు కూడామరణించారు. పెషావర్ శివార్లలో ఉన్న సరిహద్దుల్లో ఖైబర్ పఖ్తుంక్వా రాష్ట్ర శివార్లలో పాకిస్థాన్ సైన్యం దాడులు చేసింది. ఒకచోట ఆరుగురు ఉగ్రవాదులు, మరోచోట పదిమంది, ఇంకో చోట ఐదుగురు, ఏడుగురు హతులయ్యారు. ఆఫ్గానిస్థాన్ తాలిబన్లకు అనుబంధ ఉగ్రవాద సంస్థగా పాకిస్థాన్‌లో కల్లోలం సృష్టిస్తున్న తెహ్రిక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) చాలా చురుగ్గా ఆ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

# పెరూ అధ్యక్షురాలిపై లగ్జరీ వాచీల అవినీతి కేసు



**లిమా :** పెరూ రిపబ్లిక్ అధ్యక్షురాలు దైనా బొలుఆర్టేపై లగ్జరీ వాచీల అవినీతికేసులో చిక్కుకున్నారు. ఆమెపై అటార్నీ జనరల్ కార్యాలయం సోమవారంనాడు రాజ్యాంగబద్ధమైన ఫిర్యాదుచేసింది. దీంతో ఆమె పదవికే ఎసరు వచ్చింది. దక్షిణ అమెరికా పశ్చిమప్రాంత దేశం పెరూ రిపబ్లిక్‌కు మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలుగా2022 డిసెంబరు 7న దైనా బొలుఆర్టే అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఫ్రీపెరూ నేషనల్ మార్క్సిస్టుపార్టీలో సభ్యురాలుగా ఉండే బొలుఆర్టే తర్వాత ఇండిపెండెంట్‌గా పోటీ చేసి పదవిలోకి వచ్చారు. ఇటీవలికాలంలో ఈ విధమైన ఆరోపణలతో దేశాధినేతలను తొలగించేందుకు చట్టసభ సభ్యులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. ఇంతకుముందు కూడాఇలాంటి ఆరోపణలతోనే అధ్యక్షులకు కాలం చెల్లింది. ఐతే ప్రధానమంత్రి గస్టవో ఆడ్రియాంజెన్ మాత్రం బొలుఆర్టేపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు రాజ్యాంగ విరుద్ధం, అసంబద్ధం, అన్యాయపూరితం అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆమెకు ముందుగా పనిచేసిన దేశాధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లోపై ఆరోపణలు చేసి పదవి నుండి తొలగించాక ఉపాధ్యక్షురాలుగా ఉన్న బొలు ఆర్టే దేశాధ్యక్ష పదవి చేపట్టారు. తర్వాత ఆమె అనేక రోలెక్స్ వాచీలు, నగలు కూడబెట్టారన్న ఆరోపణలతో గడచిన నవంబరులో పోలీసు దాడులు కూడా ఎదుర్కొన్నారు. కాస్టిల్లో దేశ పార్లమెంటును అక్రమంగా రద్దుచేసే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు రావడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో 40 మంది మరణించారు. ఇప్పుడు బొలు ఆర్టేపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ గనుక ఈ తీర్మానం చేపడితే ఆమె కూడా దేశాధ్యక్ష పదవి నుండి వైదొలగాల్సి వస్తుంది.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)

ఊపిరిపీల్చుకున్నారు. ఇది అకతాయిలా పని అని తేల్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబం నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. భట్టి కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకు లోనయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజాభవన్‌లో బాంబు ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తి 100కు డయల్ చేసి చెప్పడంతో రాష్ట్ర పోలీస్ శాఖ వెంటనే అప్రమత్తమయింది. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ పోలీస్ అధికారులను రంగంలోకి దింపింది. హుటాహుటిన బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ప్రజాభవన్ కు చేరుకొని అడుగడుగున తనిఖీలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పంజాగుట్ట ఏసిపి మనోహర్ కుమార్ తన సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రజాభవన్ ఎంట్రన్స్ నుంచి నివాసం లోపల ఉన్న అన్ని గదులను, బెడ్రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, విజిటర్ హాల్స్, ఉప ముఖ్యమంత్రి ఛాంబర్, జిమ్, గార్డెన్, పరిసర ప్రాంతాలను అణువణువునా డాగ్ స్క్వాడ్ బృందం పోలీసులు తనిఖీలు చేశారు. అదేవిధంగా భట్టి విక్రమార్క కాన్వాయ్, కుటుంబ సభ్యులు వాడుతున్న వాహనాలను పోలీసులు క్షున్నంగా పరిశీలించారు. ఆ తర్వాత ప్రజాభవన్‌లో ఉన్న అమ్మవారి ఆలయంలో తనిఖీ చేశారు. బాంబు లేదని తేలడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్లు ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఒటి నారాయణ సహకారం తీసుకున్నాం. ప్రతిపక్ష నేతల కుటుంబ సభ్యుల ఫోన్లు, వాహనాలను ట్రాక్ చేశాం.జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు మూడు ఉపఎన్నికల సమయంలో ట్యాపింగ్ చేశాం.అక్టోబర్లో ఎన్నికల సంఘం రాధాకిషన్ రావుతో పాటు పలువురిని బదిలీ చేసింది. ఎలాగైనా సరే మూడోసారి బీఆర్ఎస్ను అధికారంలోకి తెచ్చేందుకు ప్లాన్ చేశాం. అలాగే కంపెనీలు, విఐపిలు, వ్యాపారవేత్తల పలు వివాదాలను బిఆర్ఎస్ నేతల సూచనలతో సెటిల్ చేశాము.రెండు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి డబ్బులను పెద్దఎత్తున బిఆర్ఎస్ పార్టీకి తరలించాము. రియల్టర్ సంధ్యా శ్రీధర్రావును రూ.13కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్స్ కొనేలా చేశాం మాట వినకపోతే క్రిమినల్ కేసులతో చిత్రహింసలు పెట్టాం. ప్రతిపక్ష నేతల డబ్బులు పట్టుకునేందుకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, పది మంది హెడ్‌కానిస్టేబుళ్లతో డిఎస్పి తిరుపతన్న (జైలులోఉన్నాడు) పిఓఎల్ 2023 పేరుతో ప్రత్యేక ఎలక్షన్ గ్రూపును ఏర్పాటు చేసాడు. ప్రణీత్ కుమార్ ఇచ్చిన సమాచారంతో 15 ఆపరేషన్లు నిర్వహించిన తిరుపతన్న నిర్వహించాడు. ప్రస్తుత మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంబంధించిన డబ్బులను పట్టుకున్నాడు. కొల్లూరులో రేవంత్రెడ్డి మిత్రుడు గాలి అనిల్కుమార్ నుంచి 90 లక్షలు, రేవంత్ మిత్రుడు కె. వినయ్రెడ్డి దగ్గర నుంచి రూ. 1.95 కోట్లు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ ఇన్ఫ్రా నుంచి రూ. 10.5 కోట్లు, రాజగోపాల్రెడ్డి మిత్రుడు సీహెచ్ వేణు దగ్గర రూ. 3 కోట్లు, జి. వినోద్కు సంబంధించిన విశాఖ ఇండస్ట్రీస్ నుంచి రూ. 50 లక్షలు,ఉత్తమ్ మిత్రుడు గిరిధర్ నుంచి రూ. 35 లక్షలు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి నుంచి రూ. 90 లక్షలు,పొంగులేటి మిత్రుడు ఖమ్మంలో ఫెర్టిలైజర్ సంస్థ యజమాని నుంచి రూ. 10 లక్షలు స్వాధీనం చేసుకున్నాడు.ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో డేటా మొత్తాన్ని ధ్వంసం చేశాడు.

## అడ్డుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదన్నారు.

గువ్వల బాల్‌రాజ్ ప్రోద్బలంతోనే నా ఫోన్ ట్యాపింగ్ : వంశీకృష్ణ కాంగ్రెస్ ఎంఎల్ఎ వంశీ కృష్ణ మాట్లాడుతూ బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ గువ్వల బాలరాజు ప్రోద్బలంతోనే 'నా ఫోన్' ట్యాపింగ్ జరిగిందని, ఇందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిజిపి,ఐజికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్,కెటిఆర్ డైరెక్షన్‌లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు.

## పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి, ఆప్‌ల మధ్య త్రిముఖ పోటీ జరిగింది. అప్పుడు కాంగ్రెస్ 8 స్థానాలలో (41 శాతం ఓట్లు), ఆప్ ఒక్క స్థానంలో (7 శాతం ఓట్లు), బిజెపి (9 శాతం ఓట్లు), శిరోమణి అకాళీదళ్ (28 శాతం)ఓట్లతో చెరి రెండు స్థానాల చొప్పున నెగ్గాయి. ఈసారి రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పనితీరు ఆధారంగా ఆప్ ఓట్లు కోరుతుంది. రెండున్నరేళ్ళ ప్రభుత్వ ప్రజాదరణకు ఈసారి కీలక పరీక్ష జరుగుతుంది. పదవీ కాలం మధ్యలో ఉన్న ఆప్ ప్రభుత్వంపై కొంత ప్రజా వ్యతిరేకత ప్రభావం ఉండే అవకాశాన్ని త్రోసి పుచ్చలేము. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ప్రతిష్ట, నాయకత్వపు నైపుణ్యం పరీక్షకు నిలవనుంది. ప్రచారం చివరి దశలో అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు పేరుతో సానుభూతి ఓట్లను పొందేందుకు ఆప్ ప్రయత్నిస్తుదంఇ. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకున్నదని, ప్రజాస్వామ్యాన్ని , రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసిందని ఆప్ ప్రచారం చేస్తుంది. ప్రత్యర్థులపై నిప్పులు కురిపిస్తున్నప్పటికీ రైతులకు కనీమ మద్దతు ధర అనే ఎన్నికల వాగ్దానంపై ఆప్ ప్రభుత్వానికి రైతు సంఘాల నుండి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్ ప్రభుత్వ పూర్తి కాని ఎన్నికల హామీలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు అస్త్రాలుగా మార్చుకున్నాయి. మహిళలకు నెలకు రూ. వెయ్యి పెన్షన్ వాగ్దానం అమలు చేయకపోవడం పట్ల ఆప్‌పై కొంత అసంతృప్తి వ్యక్తమవుతుంది. పంజాబ్‌లోని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా రాష్ట్రంలో ఆప్, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలకు ఎదురవుతున్న ప్రజావ్యతిరేకతపైనే దృష్టి సారించింది. ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరకంగా రైతు ఉద్యమానికి, తాజాగా పంజాబ్‌హర్యానా సరిహద్దుల వద్ద నిరసనలకు తమ పార్టీ ఇచ్చిన మద్దతుపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. వందేళ్ళ పురాతన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాళీదళ్ 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో గడ్డుకాలం ఎదుర్కొంటుంది. ఆ పార్టీ సిక్కుల ఎజెండాను తిరిగి అందుకొని రాష్ట్రంలో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తుంది. ఒంటరిగా పోటీ చేస్తున్న బిజెపి రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుంది. సిక్కులు, ఎస్‌సిలలోకి చొచ్చుకుపోవడం ద్వారా పంజాబ్‌లో తాజాగా నూతన రాజకీయ సామాజిక ఇంజనీరింగ్‌కు బిజెపి ప్రయత్నిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా పంజాబ్‌లో ఎస్‌సిల జనాభా సుమారు 32 శాతం ఉంది. ఏళ్ళ తరబడి ఈ రాష్ట్రంలో అకాళీదళ్‌కు బిజెపి జూనియర్ భాగస్వామిగా ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తోంది. శిరోమణి అకాళీదళ్ ఎన్‌డిఏ నుండి తప్పుకున్న తరువాత దూకుడు విస్తరించేంపదకు బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అకాళీదళ్‌లో పొత్తు విడిపోయిన తరువాత సిక్కుల అనుకూల పార్టీగా చెప్పుకునేందుకు బిజెపి అనేక మంది సిక్కులను తమ పార్టీలో చేర్చుకుంది. అందులో మాజీ సిఎం అమరీందర్ సింగ్, మాజీ కాంగ్రెస్ నేత గుర్మీందర్ సింగ్ సోధీ, తదితరులు ఉన్నారు. గత కొన్నేళ్ళుగా పంజాబ్‌లో క్రమంగా ఓటు బ్యాంకును కోల్పోతూ వస్తున్న బిఎస్‌పి ఈసారి దళితుల అంశాలను లేవనెత్తుతూ తిరిగి ఆ వర్గాల ఓట్లను సాధించేందుకు దృష్టి సారించింది.

**ఎన్నికల ప్రచారంలో భట్టి**

దేశంలోనే అత్యధిక మంది దళిత జనాభా ఉన్న రాష్ట్రం పంజాబ్. గతంలో కాంగ్రెస్ ఇక్కడ దళిత వర్గానికి చెందిన చన్నీని ముఖ్యమంత్రిని చేసింది. ఈ సారి ఎన్నికల్లో దళిత ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని అస్త్రాలను వాడుతుంది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సైతం అక్కడ ప్రచారంలోకి దింపింది.

## బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ట్యాపింగ్ వ్యవహారంపై ఇప్పటి వరకు సమీక్ష జరపలేదని, అధికారులు వారి పని వారు చేసుకుంటూ పోతున్నారని చెప్పారు. పోలీసుల పనిలో జోక్యం చేసుకుంటే ఏమి జరుగుతుందో తనకు తెలుసునన్నారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి కార్యకలాపాలు తమ ప్రభుత్వం చేయదని ముఖ్యమంత్రి చెప్పారు. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల విషయంలో ఫోన్ ట్యాపింగ్ జరగొచ్చని, అందుకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఎస్ఐబి అధికారులు కేంద్ర నిఘా సంస్థలతోనే నేరుగా మాట్లాడతారు తప్ప, తనతో కాదన్నారు. 1980, 1990ల నుంచి సేకరించిన డేటా అంతా ఉందో లేదో? బ్యాకప్ కూడా ఉందో లేదో దాన్ని కూడా మాయం చేశారో అంతా దర్యాప్తు అధికారులకు తెలుస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

**రాచరిక వ్యవస్థకు తావులేదు:** రాష్ట్రంలో రాచరిక వ్యవస్థకు తావులేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అంటే త్యాగాలు, పోరాటాలని, అవి గుర్తుకువచ్చేలా రాష్ట్ర చిహ్నం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర గీత రూపకల్పన బాధ్యతలు ప్రముఖ కవి అందెశ్రీకి అప్పగించామని, రాష్ట్ర చిహ్న రూపకల్పన బాధ్యతలు నిజామాబాద్ వ్యక్తికి ఇచ్చినట్లు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యపై నిపుణుల సూచనలతో ముందుకు వెళతామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కాళేశ్వరం సమస్య 32 పళ్ల లో ఒక పన్ను విరిగితే వచ్చేది కాదని, విరిగింది వెన్నుముక అని గుర్తు చేశారు. నీటిని నిల్వ చేసి విడుదల చేసే పరిస్థితి లేదని, కాళేశ్వరం కరెంట్ బిల్లులు అన్నీ సముద్రంలో వదిలిన నీళ్లలాంటివని చెప్పారు. సుమారు 52 టిఎంసిల నీళ్లు సముద్రం పాలయ్యాయని, సముద్రంలోకి వెళ్లిన నీటికీ కరెం ట్ బిల్లులు కట్టామని సిఎం చెప్పారు.

**అధికారులు అనుకూలంగా పనిచేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోవు కదా?**

రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏ వ్యవస్థనూ ఇప్పటి వరకు దురుపయోగపర్చలేదని, పక్కనున్న ఎపిలో ఎంత మంది అధికారులను మార్చారు? తెలంగాణలో ఎంత మందిని మార్చారో చూస్తే అర్థమవుతుందన్నారు. ఏ ఒక్క అధికారిపైనా ఎలాంటి ఆరోపణ రాలేదని, ఒక వేళ అధికారులు తమకు అనుకూలంగా పనిచేసి ఉంటే, ప్రతిపక్షాలు చూస్తూ కూర్చోవు కదా అన్నారు.

**కరెంట్ విషయాలన్నీ త్వరలోనే బయటపెడతాం**

రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈదురు గాలుల కారణంగా చెట్లు పడిపోవడం, విద్యుత్ వినియోగం పెరగడం, ట్రాన్ ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పునరుద్ధరణ విషయంలో కొంత సమయం తీసుకుని ఉండొచ్చునన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విద్యుత్ డిమాండ్ తెలంగాణలో పెరిగిందని, అందుకు అనుగుణంగా ఎక్కడా సమస్యలు రాకుండా చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత విద్యుత్‌కు సంబంధించిన అన్ని విషయాలు బయటపెడతామని స్పష్టం చేశారు.

## ముఠా గుట్టు రట్టు (మొదటి పేజీ తరువాయి)

డాక్టర్‌గా చలామణి అవుతున్న ఓ ఆర్ఎంపి మహిళా వైద్యురాలు శోభా రాణితో పాటు మరో ఇద్దరిని ఓ పసిపాపను అమ్ముతున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా తొలుత అరెస్టు చేసిన అనంతరం కొనసాగించిన విచారణ నేపథ్యంలో అంతర్జాతీయంగా కొనసాగిస్తున్న ముఠా తతంగం బయట పడింది. ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి ఏజంట్లు, సబ్ ఏజంట్లుగా ఈ తతంగంలో వ్యవహరించిన ఎనిమిది మందిని అరెస్టు చేసారు. ఇప్పటి వరకు ఈ ముఠా మొత్తం 16 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసులు విచారణలో నిర్థారించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ డిసిపి పద్మజా రెడ్డి, మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి,మేడిపల్లి ఇనస్పెక్టర్ గోవిందరెడ్డి, ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నర్సింగరావు, అనీల్ కుమార్‌లతో కల్సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి ఈ కేసుకు సంబంధించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న ఓ స్వచ్ఛంద సంస్థకు అందిన సమాచారంతో తమకో చిన్నారి కావాలంటూ ఫోన్ ద్వారా ఆర్ఎంపి డాక్టర్ శోభారాణిని సంప్రదించి పది వేల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించి మిగిలిన సొమ్ము ఇచ్చి తీసుకొనేందుకు ఆమెకు చెందిన ప్రథమ చికిత్సా కేంద్రానికి వెళ్లి చిన్నారిని తీసుకొనే క్రమంలో ముందస్తు సమాచారం మేరకు అక్కడికి చేరుకొన్న మేడిపల్లి పోలీసులు వారిని చిన్నారితో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి దర్యాప్తు ఫలితంగా ఈ ముఠా ఢిల్లీ ప్రాంతానికి చెందిన ప్రీతి, కిరణ్, మహారాష్ట్రలోని పూనే ప్రాంతానికి చెందిన కన్నయ్యల ద్వారా వివిధ రాష్ట్రాల నుండి చిన్నారులను సేకరించి తీసుకొని వచ్చి సంతానం లేని వారికి రూ 1.80 లక్షల నుండి రూ.5.50 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు ఢిల్లీ, పూనాలకు చెందిన ఈ ముగ్గురు నగరంలోని ప్రధాన నేరస్తులైన శోభారాణికి 50 మంది చిన్నారులను సరఫరా చేసింది. ఈ ముఠాలోని ఎనిమిది మందిని అరెస్టు చేయగా పరారీలో ఉన్న కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం గాలిస్తున్నామని కమిసనర్ తెలిపారు. ఈ ముఠా నుండి స్వాధీనం చేసుకొన్న 11 మంది చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ శాఖా అధికారులకు అప్ప చెప్పారు.

## ఈశాన్యం అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులను సజీవంగా కాపాడినట్లు ఐజ్వాల్ డిప్యూటీ కమిషన్ పేర్కొన్నారు. హంతర్ వద్ద 6వ నెంబర్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో రాష్ట్ర రాజధానికి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు చెప్పారు. అనేక రాష్ట్ర రహదారులపై కూడా కొండచరియలు విరిగిపడ్డాయన్నారు. రాష్ట్రంలో పరిస్థితిపై ముఖ్యమంత్రి లాల్దుహోమా హోంమంత్రి కె. సప్దాంగ, సిఎస్ రేణు శర్మ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. క్వారీ కుప్పకూలన ఘటన సహా వర్షం సంబంధిత ఘటనల్లోమృతి చెందిన కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియాను సిఎం ప్రకటించారు. తాత్కాలిక ఉపశమనం కింద రూ. 2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా, సిఎం, డిప్యూటీ సిఎం సహా విపత్తు నిర్వహణ, పునారావస విభాగం అధికారులు స్టోన్ క్వారీ వద్దకు విచ్చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. వర్షాల కారణంగా అన్ని పాఠశాలలను మూసివేశారు. అత్యవసర విభగాల్లో మినహాయించి ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కేటాయించారు. సైరాంగ్ గ్రామం వద్ద ఉన్న ట్లావంగ్ నది ఉప్పొంగడంతో 30కిపైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**అసోంలో ముగ్గురు, మేఘాలయలో ఇద్దరు మృతి:** మరోవైపు అసోంలోనూ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వేర్వేరుగా జరిగిన వర్షం సంబంధిత ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా, 17 మందికి గాయాలయ్యాయి. సంతిపూర్ జిల్లాలోని చెట్టు కూలి పాఠశాలపై పడడంతో 12 మంది చిన్నారులు గాయపడ్డారు. రాష్ట్రంలో ప్రతికూల వాతావరణం కొనసాగనున్నట్లు సిఎం హిమంత్ బిస్వశర్మ చెప్పారు. మేఘాలయాలో భారీవర్షాల కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, 500 మం ది గాయపడ్డారు. 24 గంటల పాటు కురిసిన అకాల వర్షాలకు 17 గ్రామాలపై ప్రభావం చూపింది 10 ఇళ్లు ధ్వంసమయ్యాయి.

**అరుణాచల్ ప్రదేశ్‌కు రెడ్ అలర్ట్:** అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భారీవర్షాలు కురిసేఅవకాశం ఉందని హెచ్చరించిం ది. 'పాపుమ్ పారే, పశ్చిమ కమెంగ్ జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉం ది.

## ఆకస్మిక దాడులు (మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆర్‌టిఎ కార్యాలయాల్లో అనధికార వ్యక్తులతో కలిసి అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఇక ఖమ్మం జిల్లా అశ్వారావుపేట్ చెక్ పోస్టులో అనధికార వ్యక్తులు డబ్బులు వసూలు చేసి అధికారులకు ఇచ్చినట్లు తేలింది. ఉదయం 10 గంటల నుంచి మొదలైన ఎసిబి దాడులు సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగాయి. కరీంనగర్, సిద్దిపేట్,మహబూబ్‌నగర్ ఆర్‌టిఎ కార్యాలయంలో ఎలాంటి నగదు పట్టుబడలేదు. అయితే ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు వాహన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌టిఎ కార్యాలయాల్లో పట్టుబడిన నగదు వివరాలు ఇలా ఉన్నాయి. బండ్లగూడలో రూ.48370, మలక్‌పేటలో రూ.22000, టోలిచౌకిలో రూ.43 360, మహబూబాబాద్‌లో రూ.61900, అశ్వారావ్‌పేట్ చెక్‌పోస్టులో రూ.34050నగదును స్వాధీనం చేసుకున్నారు.ఎసిబి ఆకస్మిక తనిఖీల్లో ఏజెంట్లు, బ్రోకర్లను అదుపు లోకి తీసుకుని అధికారులు విచారిస్తున్నారు.

## సాక్ష్యాలు మార్చేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

చేరడానికి ఉపకరించాడనీ, కొన్ని హోల్‌సేల్ కంపెనీలలో లాభాలు పొందానికి ఆమె తరపున ఈ చెల్లింపులు చేశారని ఇ డి పేర్కొంది. ''మెస్సర్స్ ఇండో స్పిరిట్స్‌లో అరుణ్ పిళ్ళై షేరుకు అంతిమ బాధ్యురాలు కె.కవిత అనే విషయం చాలా స్పష్టంగా తేటతెల్లమైందనీ, ఈ ఎక్సైజు విధానం రూపొందించడంలో ముడుపులు చెల్లించే పథకం కింద నేర ప్రక్రియలో తుది లాభాలు సాధించేందుకు ఇండో స్పిరిట్స్ ద్వారా ఆమె వాస్తవికంగా భాగస్వామురాలుగా ఉన్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నివాసం నుండి కవితను ఇడి అధికారులు ఈ ఏడాది మార్చి 15వ తేదీన అరెస్టుచేసి ఢిల్లీకి తరలించారు. తర్వాత సిబిఐ అధికారులు ఆమెను తీహార్ జైలు నుండి అరెస్టు చేశారు. ఐతే ఈ కేసులతో తనకు ఎలాంటి సంబంధం లేదని కవిత తన బెయిలు పిటిషన్‌లో వాదించారు.

# పాఠ్యాంశంగా ‘సురవరం’ జీవిత చరిత్ర

సాహితీ పురస్కార ప్రదానోత్సవంలో పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి వినతి






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వైతాళికులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలని శాంతా బయోటెక్నిక్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి కోరారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాప రెడ్డి 128వ జయంతిని పురస్కరించుకుని "సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం – 2024"ను సీనియర్ పాత్రికేయులు తిరునగరి ఉదయవర్లుకు అందజేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లోని సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో మంగళవారం సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్వర్యంలో జరిగిన సభకు ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత హాజరయ్యారు. సభలో వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన అక్షరమే ఆయుధంగా చరిత్ర సృష్టించిన మహనీయులు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్యాన్ని అక్షరీకరించిన పాత్రికేయులు తిరునగరి ఉదయవర్లుకు అందజేయడం ఎంతో సముచితమన్నారు. ఒక కవి తన కవిత్వం ద్వారా అందరి మన్నలను పొందాలకుంటారే తప్ప కవులను తయారుచేయాలను కోరని, కానీ ఎంతో ఉదార హృదయం గల సురవరం ప్రతాపరెడ్డి ఎంతోమందిని కవులుగా, సాహిత్యకారులుగా తీర్చిదిద్దిన మహనీయులని కొనియాడారు. ఆలాంటి మహావ్యక్తి జీవిత చరిత్ర పాఠ్యాపుస్తకాల్లో పొందపర్చితే అది భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. అదే విధంగా ఆ మహావ్యక్తి అవార్డును సాహిత్య రంగానికి కూడా వర్తింపజేయాలని, ఇక ప్రతి ఏటా రెండు పురస్కారాలను అందించేందుకు ట్రస్ట్ చర్యలు తీసుకోవాలని, అందుకు తన వంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. విరాహత్ అలీ మాట్లాడుతూ నిజాం నిరకుశ పాలన కాలంలో తన సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించడమే కాకుండా ఓ ఆంధ్ర పండితుడు తెలంగాణలో కవులే లేరంటూ అపహాస్యం చేస్తే 350 మంది తెలంగాణ కవులను ఒక చోట చేర్చి కవితా సంపుటి ద్వారా తెలంగాణ గడ్డ పౌరుషాన్ని చాటిచెప్పిన అక్షరయోధుడు సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి, డాక్టర్ చెన్నయ్యతో పాటు పలువురు కవులు సురవరం ప్రతాప రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయండి

ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్



**ప్రజాపక్షం/చర్లపల్లి :** అనుమతి లేని కళాశాలలు, పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇసిఐఎల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రైవేట్, కార్పొరేటర్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌కెజి ఫీజులు బీటెక్ ఫీజులతో సమానంగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల నుండి యాభై వేల వరకు వసూలు చేస్తున్నారని, పాఠశాలల అవరణలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారన్నారు. పట్టించుకోవాల్సిన విద్యాశాఖ అధికారులే వారికి వత్తాసు పలుకుతూ అండగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫీజుల నియంత్రణ చేపట్టాలని, అనుమతిలేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు అరవింద్, సాయి, నరేష్, శివ, ఆదిత్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మతతత్వవాదాన్ని తిప్పికొట్టేలా ఎన్నికల ఫలితాలు : రాములు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మతతత్వవాదాన్ని తిప్పి కొట్టేలా పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలు ఉంటాయని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు బలపర్చిన అభ్యర్థులు గెలవబోతున్నారన్నారు. జూన్ 2న తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు సోమగాని కృష్ణ, సుందరి పద్మ, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, మామిడి వెంకయ్య, గుండెబోయిన వెంకన్న, చక్రాల స్టాలిన్, యల్లావుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేయాలని, వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి శ్రీకాంత్ అధ్యక్షతన జిల్లా ఎఐకెఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021 నాటికి వ్యవసాయ ప్రణాళికను నిలిపివేసిందన్నారు. వ్యవసాయ విధానాన్ని రూపొందించి ప్రణాళికను ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 6న హన్మకొండలోని సుందరయ్య భవన్ హాలులో ఎఐకెఎస్ జిల్లా సమావేశం జరుగుతుందని, సమావేశంలో జిల్లాలోని రైతాంగం ఎదుర్కొంటున్న సీజనల్ సమస్యలపై, ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన హామీలు జిల్లాలో అమలుపై చర్చించనున్నట్లు తెలిపారు. హన్మకొండలోని సుందరయ్య భవన్ హాలులో సమావేశం జరుగుతుందని, రైతు సంఘం ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక కుటుంబాల సంక్షేమానికి కృషి : సత్యనారాయణ



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మిక ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని, కార్మికుల, కార్మికుల కుటుంబాల సంక్షేమానికి కార్మిక వాడల్లో, సింగరేణి ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మందమర్రి ఏరియా జిఎంను కోరారు. మంగళవారం ఏరియా జిఎంతో గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు సమావేశమై కార్మికుల సమస్యలు, సింగరేణి ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి హైస్కూల్‌లో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపించాలని, సిఇఆర్ క్లబ్‌లో స్విమ్మింగ్ పూల్ వాటర్ ఫిల్టరైజేషన్ చేయాలని, ఏరియాలోని గనుల్లో నూతన ఎస్‌డిఎల్ యంత్రాలను ప్రవేశ పెట్టాలని, కాలం చెల్లిన యంత్రాలతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కష్టం అవుతుందని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు తెలిపిన అంశాలపై జిఎం సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో రాగం మల్లేష్, తిరుపతి గౌడ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఎఆర్ ఎఐగా పనిచేస్తూ ఇటీవల మరణించిన వెంకటయ్య కుటుంబ సభ్యులకు మంగళవారం జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే పోలీస్ భద్రత స్కిం ద్వారా రూ.6లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల సంక్షేమమే తమ లక్ష్యం అన్నారు. వారి కుటుంబాల సంక్షేమం కోసం ఎప్పుడు పోలీస్ శాఖ పాటుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ మంజుభార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రామచంద్రగౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. తప్పుడు వాల్యుయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని వారు కోరారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ చేసిన వారు అలసత్వం వహించి తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని, మెరిట్ విద్యార్థికి మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే విచిత్రంగా ఉందన్నారు. విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే పరీక్ష రాశాక ఊహించుకుంటారని, ఫలితాల అనంతరం మార్కులు చూసి షాక్‌కి గురయ్యారని తెలిపారు. రివాల్యుయేషన్, రీకౌంటింగ్‌తో పేపర్లు తెప్పించుకుని చూస్తే పేపర్ వాల్యుయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లు దిద్దారని, వచ్చిన మార్కులు ఒకటైతే ఆన్‌లైన్‌లో ఇంకో రకంగా మార్కులు వేశారని తెలిపారు. ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన ఇష్టానుసారంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడిస్తామని హెచ్చరించారు.

# జిపి కార్మికుల పెండింగ్ వేతనాలివ్వండి

ఎఐటియుసిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, దేవేందర్‌రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/దేవరకొండ :** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఆరు నెలలు, మరి కొన్ని జీపిలలలో 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీ ఖాలో ఉన్న డబ్బులన్ని అధికారులు, సర్పంచ్‌లు కాజేశారని ఆరోపించారు. పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చే తక్కువ వేతనాలు అయినా, సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోజువారి ఖర్చులు వెల్లదీసుకునే పరిస్థితులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారి జూలూరి వెంకట్రాములు, మండల కార్యదర్శి మల్లయ్య, జిపి కార్మిక సంఘం మండల కార్యదర్శి వీరయ్య, అధ్యక్షులు అంజమ్మ, బొజ్జ, పర్వతాలు, భారతి, దేవరాజ్, వినోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌తో నీచసంస్కృతికి శ్రీకారం

బ్లాక్‌మెయిల్ చేసి కెసిఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించారు

కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు సత్యనారాయణ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఫోన్ ట్యాపింగ్‌తో కెసిఆర్ కుటుంబంలో ఆయనతో కెటిఆర్, హరీష్‌రావులు నీచ, నికృష్ట సంస్కృతికి శ్రీకారం చుట్టారని కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయ డం సిగ్గు చేటన్నారు. అందులో మాజీ ఐజి రాధాకిషన్ ఇచ్చిన వాంగ్మూలం లో తన పేరు చెప్పడం బాధాకరమన్నారు. తాను రాజకీయాల్లో సేవ చేయడానికి వచ్చిన వాడినని, చదువుకున్న డాక్టర్‌ను అని, తన ఫోన్ ట్యాపింగ్ చేశారని తెలియడంతో చాలా బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంధర్భాల్లో మిత్రులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడిన విషయాలు వేరే వాళ్లకు తెలిసినప్పుడు నాతో ఉండే పిఏని, కొంత మంది సన్నిహితులను అనుమానించాల్సి వచ్చిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, వారి కుటుంబ సభ్యులు ప్రతిపక్ష పార్టీ నాయకులు, స్వంత పార్టీ నాయకులు, కుటుంబ సభ్యుల ఫోన్లతో సహా ట్యాపింగ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఫోన్లు కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిజినెస్ పర్సన్ల ఫోన్లు ట్యాపింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసి వేల కోట్ల రూపాయలు సంపాదించారన్నారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేస్తామని విర్రవీగిన కెసిఆర్ కుటుంబానికి ప్రజలు మొన్నటి ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పారన్నారు. తాను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడిగా ఉండి జిల్లాలో పార్టీ బలోపేతం కోసం పనిచేసాను కానీ ఏ రోజూ అక్రమ వ్యాపారాలు, భూ దందాలు, ఇసుక దందాలు చేయలేదన్నారు. నా ఫోన్ ట్యాపింగ్ చేసి సాధించిందేమీ లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి నీచ నికృష్ట చర్యలు సరికావన్నారు ఈ విషయమై ముఖ్యమంత్రి, డిజిపిని కలిసి ఫిర్యాదు చేస్తానని, హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ ఫోన్ ట్యాంపరింగ్ అనేది దుర్మార్గమైన చర్య అని, భారతదేశంలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? అని ప్రశ్నించారు. కెటిఆర్, హరీష్‌రావు నీచ సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ దళిత నాయకుడు, విద్యావంతుడు, పవిత్రమైన డాక్టర్ వృత్తి నుంచి వచ్చిన వాడని, ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారని, తాను మానకొండూర్ ఎమ్మెల్యే గా రెండు, మూడు సార్లు పోటీ చేసి ఓడిపోయారని, వారు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, అలాంటి వ్యక్తి ఫోన్ ట్యాంపరింగ్ చేసి అసెంబ్లీ ఎన్నికలు ఎలాగైనా మట్టి కరిపించాలని పన్నాగం పన్నారని, ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండొద్దన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు మడుపు మోహన్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మహిళా నేతలు జ్యోతి రజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాడేవారికే ప్రజలు పట్టంకడుతారు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** సమస్యలపై పోరాడే వారికే ప్రజలు పట్టం కడుతారని, ఎన్నికల్లో వారికే విజయం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నికల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా ప్రజా, నిరుద్యోగుల సమస్యల పట్ల పోరాడుతున్న ప్రజాగొంతుక తీన్మార్ మల్లన్నకు మూడు జిల్లాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఏడుగురు మంత్రులతో పాటు వామపక్ష పార్టీలు, టిడిపి, టిజేఎస్ పార్టీలు, బీసీ సంఘాలన్ని తీన్మార్ మల్లన్నకు వెన్నుదన్నుగా ఉన్నాయన్నారు. అటు పట్టభద్రుల మద్దతు, ఇటు ప్రజాప్రతినిధుల అండతో తీన్మార్ మల్లన్న గెలుపు నల్లేరు మీద నడకల్లా సాగనున్నదని వారు అన్నారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, టిడిపి నాయకులు కొదమగండ్ల నగేష్, చిలకరాజు శ్రీను, ఇంజమూరి వెంకటయ్య, ఇంజమూరి వెంకటయ్య, రణపంగ నాగయ్య, రాచకొండ అజయ్, కొణతం చినసీతారాంరెడ్డి, కరీముల్లా, పాండు నాయక్, తాళ్ల సురేష్‌రెడ్డి, కొమ్రరాజు వెంకట్, నీలా రామ్మూర్తి, ఆకారపు వెంకటేశ్వర్లు, గజ్జల కోటేశ్వరరావు, మచ్చ శ్రీను, కత్తి శ్రీనివాసరెడ్డి, గాజుల పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సాయం చేసేందుకే (మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు రాజ్యాంగాన్ని రక్షించే ఇండియా కూటమి ఉండగా, మరోవైపు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూసే శక్తులు మరోవైపు ఉన్నాయన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని ఎత్తివేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ‘అగ్నిపథ్’ పథకాన్ని బుట్టదాఖలు చేస్తామని హామీనిచ్చారు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఆ పరమాత్మే తనను పంపారని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. మనలో ప్రతి ఒక్కరూ జీవసంబంధమైన వారు కానీ నరేంద్ర మోదీ జీవసంబంధమైన వారు కాదు. అంబానీ, అదానీలకు సాయం చేయాలని పరమాత్మ ఆయనను పంపారని ఎద్దేవా చేశారు. రైతులు, కార్మికులకు సేవ చేసేందుకు పరమాత్మ ప్రధాని నరేంద్ర మోదీని పంపలేదన్నారు. నిజంగా పరమాత్మ మోదీని పంపిఉంటే ఆయన పేదలు, రైతులకు సాయపడేవారని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నుల సేవలో మోదీ తరిస్తున్నారని మండిపడ్డారు. పేదల సమస్యలు, ధరల మంట, నిరుద్యోగం వంటి వాస్తవిక అంశాలను కాషాయ నేతలు విస్మరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయిస్తుందన్నారు.

**చట్టబద్ధ పాలనకు ముగింపు పలికిన మోదీ...** మధ్యప్రదేశ్ సాగర్‌లో దళిత యువతి సోదరుడు హత్యకు గురికావడంపై బిజెపిపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ చట్టబద్ధ పాలనకు ముగింపు పలికారని మండిపడ్డారు. దళిత యువకుడి హత్య తన హృదయాన్ని తీవ్రంగా కలిచివేసిందని, మధ్యప్రదేశ్‌లో దళిత కుటుంబానికి బిజెపి నేతలు ఏం చేశారని ఆలోచిస్తే ఆగ్రహం కలుగుతుందన్నారు.

ఈ మేరకు రాహుల్ ‘ఎక్స్’లో పోస్టు చేశారు. దళిత యువతి సోదరుడి హత్య ఘటన బిజెపి పాలనలో సిగ్గుపడాల్సిన విషయమని చెప్పారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు కూడా నిందితులకు అండగా ఉంటుందని, బాధిత మహిళలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## బ్లాక్ మార్కెట్‌కు పత్తి విత్తనం

(మొదటి పేజీ తరువాయి)

తదితర విత్తనాలకు డిమాండ్ ఉంది. ఇవి రోగాన్ని తట్టుకోవడంతో పాటు దిగుబడి పెరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ఈ విత్తనాలను వ్యాపారులు బ్లాక్ చేశారు. పై పేరున్న విత్తనాల ధర 840రూపాయలు ఉండగా రెండు వేల నుండి రెండు వేల ఐదువందల రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. రైతుకు ఇచ్చే చిట్టిలో మాత్రం ప్యాకెట్‌పై ఉన్న ధరలు ఎంట్రీ చేస్తున్నారు. అధికంగా వసూలు చేసే ధరను నమోదు చేయలేదు. ఇదేంటంటే ఇవి బ్లాక్‌లో ఉన్నాయి, దొరకడం లేదు..మీ ఇష్టం ఉంటే కొనుగోలు చేయడండి లేకుంటే లేదంటు వ్యాపారులు బుకాయిస్తున్న పరిస్థితి.

**నిఘా కరువు...** ప్రతి ఏటా పత్తి విత్తనాల విక్రయం సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఫర్టిలైజర్ దుఖానాలను తనికీ చేసే వారు. ఈ ఏడాది ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు అటు వైపు చూడడం లేదు. ఈ నెల 21న వ్యవాయ శాఖ డైరెక్టర్ బి గోపి జనగామ నుండే వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. కల్తీ విత్తనాల విక్రయాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఫర్టిలైజర్ షాపులపై నిఘా పెట్టడం కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలని ఆదేశించారు. జనగామ జిల్లాలో ఎక్కడా తనిఖీలు జరగడం లేదు. దీనితో ఎవరు ఎలాంటి విత్తనాలు విక్రయిస్తున్నారో తెలియని పరిస్థితి.

**కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి : ఆది సాయన్న**

జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆది సాయన్న వ్యవసాయ అధికారులను కోరారు. వ్యాపారులు రైతుల నుండి అధికంగా డబ్బులు వసూలు చేయడంతో పాటు గతేడాది విత్తనాలు సైతం విక్రయిస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. ఫర్టిలైజర్ షాపుల్ని క్షుణంగా తనిఖీ చేయడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు పరిశీలించాలని, అధిక ధరలకు వసూలు చేయడకుండా అడ్డుకోవాలని కోరారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు డిపాజిట్ బాండ్ల అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సంబంధించిన రూ. 78 లక్షల ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లను ఇటీవల ఎన్నికైన నూతన కమిటీకి బుక్‌ఫెయిర్ పూర్వ కోశాధికారి పి.రాజేశ్వరరావు అందజేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యాలయంలో వ్యవస్థాపక కార్యదర్శి, పూర్వ కోశాధికారి పి.రాజేశ్వర్‌రావు, మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్ నుండి నూతన అధ్యక్షుడు యాకూబ్, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి మొత్తం రూ 78.28 లక్షల విలువైన బాండ్స్‌ను అందుకున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com